# పొత్తూరు నాగేశ్వరరావు  ఆధునిక నీతికథలు

గుంటూరు జిల్లాలో ఓ మారుమూల గ్రామంలో మూడెకరాల శేరీమాగాణి అమ్మి, వ్యాపారం చేసే ఉద్దేశంతో రెండు దశాబ్దాల క్రితం హైదరాబాద్ వచ్చాడు లోకేశ్వర్రావు. ఆయన పెద్దగా చదువుకోలేదు అయితే జీవితం అనే విద్యాలయంలో ఎంతో చదువుకున్నాడు. అనుభవమే ఎన్నో డిగ్రీల్ని అదృశ్యంగా కట్టబెట్టింది. తెచ్చిన సొమ్ముతో వారంరోజులపాటు ఆలోచించి ఓ చిన్న ప్రింటింగ్ ప్రెస్ పెట్టాడు. ఒక ట్రెడిల్, కటింగ్ మెషీన్, జాబ్‌వర్క్ షెపులతో. మొదట్లో ఆర్నెల్లపాటు వెడ్డింగ్‌కార్డ్సు, లెటర్‌ప్యాడ్స్, విజిటింగ్‌కార్డులు మొదలైన జాబ్‌వర్క్‌లు చేసేవాడు. సంవత్సరం తిరగకముందే బుక్‌వర్క్ మొదలెట్టాడు; సింగిల్‌డెమ్మీ మెషీన్ కొన్నాడు. ప్రెస్ ఆవరణలో మరో పోర్షన్ అద్దెకు తీసుకున్నాడు. ప్రింటింగ్ వ్యాపారాన్ని పెంచాడు.

లోకేశ్వర్రావు కష్టజీవి. తాను చేసే పనిమీద పూర్తి విశ్వాసం గలవాడు. తన వ్యాపారమార్గంలో క్రమేపీ మెట్లెక్కి, అంతిమ ధ్యేయానికి చేరుకోవడం ఆయన ఆదర్శం. ఆదర్శసాధనకు చిత్తశుద్ధి, పట్టుదల, కృషి తోడ్పడ్డాయి. మరో మూడేళ్ళలో రెండు మెషీన్లు కొన్నాడు. ఆటోమేటిక్ డబుల్‌డెమ్మీ, కలర్‌వర్క్ కోసం ఆటోమేటిక్ ట్రెడిల్, షెపు పెంచాడు. బుక్‌వర్క్‌లో క్వాలిటీకి ప్రాముఖ్యమిచ్చాడు. అచిరకాలంలోనే మంచి ప్రింటర్‌గా పేరుతెచ్చుకున్నాడు.

నాలుగేళ్ళు గడిచాయి.

లోకేశ్వర్రావు ప్రింటింగ్ వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా అభివృద్ధిచెందింది. ప్రింటింగ్ ఆర్డర్లు విపరీతంగా వొచ్చి పడుతున్నాయి. అంతకుముందు తానే లెక్కలు వ్రాసుకొనేవాడు; తానే ప్రూఫులు దిద్దుకొనేవాడు; అవసరమైతే తానే కంపోజ్ చేసేవాడు; తానే మెషీన్ వేసేవాడు. ఇప్పుడు అది సాధ్యపడటంలేదు ఒక మేనేజర్ను, అకౌంటెంటునూ, ప్రూఫ్‌రీడర్ని నియమించాడు. ప్రింటింగ్ సిబ్బందిని పెంచాడు.

ఇంకో నాలుగేళ్ళలో లోకేశ్వర్రావు హైదరాబాద్‌లో 'ఏ'క్లాసు ప్రింటర్ల జాబితాలో చేరాడు. డామినెంట్ డబుల్‌కలర్ ఆఫ్‌సెట్ మెషిన్ను తెప్పించాడు. ప్రింటింగ్ టెక్నాలజీలో వస్తున్న మార్పుల ప్రకారం తానూ ప్రెస్‌ను ఆధునికంగా సరిదిద్దుకోవాలనుకున్నాడు. బ్యాంకునుంచి పుష్కలంగా ఋణ సౌకర్యం లభిం

చింది. ప్రెస్ ఆవరణనూ, దానిపక్కన మూడొందల గజాల ఖాళీస్థలాన్నీ కొన్నాడు.

మరికొన్ని సంవత్సరాలకు ఫోటో కంపోజింగ్ యూనిట్‌ను, మల్టీకలర్ మెషీన్‌ను, ప్రోగ్రామాటిక్ కటింగ్‌మెషీన్‌నూ తెప్పించి, కొన్ని యూనిట్లను ఎయిర్ కండిషన్ చేయించి, ఒక ఎం.బి.ఎను ఎగ్జిక్యూటివ్‌గా నియమించి, తాను మేనేజింగ్ డైరక్టరుగా ఉండసాగాడు లోకేశ్వర్రావు. కలర్‌వర్క్‌మీద దృష్టిని కేంద్రీకరించాడు. అమెరికా, ఇంగ్లాండ్, వెస్ట్‌జర్మనీ మొదలైన దేశాలు తిరిగొచ్చి ప్రింటింగ్ టెక్నాలజీలో అధునాతన పద్ధతుల్ని అధ్యయనంచేసి వచ్చాడు.

హైద్రాబాద్‌లోని పెద్దపెద్ద కంపెనీలు, అడ్వర్టయిజ్‌మెంట్ ఏజన్సీలు, ప్రభుత్వసంస్థలు విపరీతంగా ప్రింటింగ్‌వర్క్‌ను ఇవ్వసాగాయి. లోకేశ్వర్రావు ప్రెస్ టర్నోవర్ ముప్పై, నలభై లక్షలకు చేరుకుంది.

ఒకరోజు ఒక కెమికల్ కంపెనీ ఎం.డి. లోకేశ్వర్రావుకు, టెలిఫోన్‌లో మూడు రంగుల్లో కేటలాగ్‌ను 'సిక్స్ థౌజండ్' కాపీలు ప్రింట్ చేయమని చెప్పాడు. డిజైన్ కలర్ కాంబినేషన్ మోడల్‌ను పంపించాడు. 'సిక్స్‌థౌజండ్' ఆర్డరును 'సిక్స్టీ థౌజెండ్' ఆర్డరుగా విని, మేనేజరుకో చెప్పి ఆ విధంగా ప్రింట్ చేయించాడు. ఆ కెమికల్ కంపెనీవారు ఆరువేలు మాత్రమే తీసుకున్నారు. మిగతా యాభైనాలుగువేలకు తాము ఆర్డరు ఇవ్వలేదన్నారు. లోకేశ్వర్రావు మేనేజరుపై మండిపడ్డాడు. మేనేజరు నీళ్ళు నమిలాడు. "తాము ఆ విధంగానే___"

"మీరే పొరపాటుగా అలా విని వుంటారు. నే నెప్పుడూ తప్పుగా వినను" అన్నాడు లోకేశ్వర్రావు గట్టిగా.

మేనేజరు నోరు మూసుకొన్నాడు - ఎదురుచెబితే ఉద్యోగానికి తిలోదకాలు ఇచ్చుకోవాల్సివస్తుందని.

"మీ తప్పువల్ల ప్రెస్ నష్టపడటానికి వీల్లేదు నెలకు మీ జీతంలో రెండొందలచొప్పున రికవరీ చేయిస్తాను" అన్నాడు లోకేశ్వర్రావు దయ చూపుతున్నట్టు.

మేనేజరు కుక్కిన పేను అయిపోయాడు. తల దించి, సరేనన్నట్టు తల ఆడించాడు. సిక్స్‌కు బదులు సిక్స్టీగా విన్న తన చెవుల్ని గిచ్చుకున్నాడు.

*యజమాని ఎల్లప్పుడూ సరైన వ్యక్తి కానక్కర్లేదు.*
*అయితే యజమాని ఎప్పుడూ యజమానే.*